అమావాస్యనిశ

శ్రీమతి శిరుగూరి రత్నమ్మగారు

(హిందీనుండి అనువదింపబడిన చిన్నకథ)

౧

దీపావళి నాటిరాత్రి శ్రీనగరమున గల సంపన్నగృహములయందునను పాడిండ్లయందునను శోభగా నుండెను. నగరమునగల బాలురు, బాలికలు శుభ్రముగాతో మిలెల్లగా మెరయుచున్న పళ్లెరములయందు దీపములు పెట్టుకొని దేవాలయముపైపు వెళ్లుచుండిరి. దీపములకన్నను అధికముగా నాబాలబాలికల ముఖారవిందములు మెరయుచుండెను. ప్రతిగృహమును దీపావళిచే ప్రకాశించుచుండెను. కేవలము పండిత దేవదత్తునియొక్క ఏడంతస్థుల మేడమాత్రము గంభీరముగాను, భయంకరముగాను ఉండెను. పూర్వౌన్నత్యముయొక్క స్మృతిచిహ్నముగా నిలచియుండెను. ప్రస్తుతము ద్వారపాలకులకుమారుగా వృక్షములు నిలచియుండెను. దివాన్‌ఖానా అంతయూ పాలిపట్లతో నిండియుండెను. ఏఇంటిలో సుందరీమణుల మనోహరసంగీతగానము వినవచ్చుచుండెనో అచ్చటనే నేడు అడవిపావురముల మధురస్వరము వినవచ్చుచుండెను. ఇదియంతము కాలమాహాత్మ్యమే!

నేడు అమావాస్యదీపముల ప్రకాశమువలన అంధకారము పరాజితమయి దేవదత్తుని విశాలభవనములో శరణుజొచ్చెను. దేవదత్తుడీ అంధకారమున తనగదియందు చింతానిమగ్నుడై యుండెను. నేటికి నెలదినములనుండి దేవదత్తుని పత్నియగు గిరిజదేవి మరణాసన్నురాలై యుండెను. దేవదత్తుడు మిక్కిలి దరిద్రము, దుఃఖము అనుభవించుచుండెను. అదృష్టముపై నాధారపడి అతను ధైర్యము కలిగియుండెను. కాని ఈనూతనవేదన అతనికి సహింపనలవి కాకుండెను. పాపము దినదినమును కృశించుచున్న గిరిజయొక్క పర్యంకతలమున ఆసీనుడై ఆమె ముఖమును వీక్షించుచూ దుఃఖించుచుండెను. ఒక్కొక్కప్పుడు గిరిజయు తన జీవితముపై నిరాశ చెంది యేడ్చుటయు కలదు. అప్పుడు దేవదత్తుడామెను ఓదార్చుచుండును.

పండిత దేవదత్తుని పూర్వులు వడ్డీవ్యాపారము బాగుగా చేయుచుండెడివారు. వారికి ఎక్కువగా రాజులతోను, మిక్కిలి ధనవంతులతోను వ్యాపారముండెడిది. పూర్వకాలమునందు ఇప్పటివలె 'దస్తావేజు'లుగాని 'ప్రోనోట్లు'గాని లేవు. అప్పుపత్రములు తెల్లకాగితములపై వ్రాసి చేవ్రాలు చేయుటయే కాని సాక్షులు, సంతకములు మొదలగునవేవియు లేవు.

కొన్నిదినముల తరువాత గొప్పకాటకము సంభవించెను. దానితో దేవదత్తుని తండ్రి ఆస్తినంతయూ పోగొట్టుకొనెను. దేవదత్తుడు పెద్దవాడగుసరికి నివసించుచున్న యొకగృహము ఋణపత్రములుమాత్రము మిగిలియుండెను. దేవదత్తుని చేతిలో నొకరాగిపైసయైనను లేకుండెను. ఇదివరకు కృషియన్న నేమియు నెరుగని దేవదత్తునకు కృషిసల్పుట కష్టముగానుండెను. వర్తకముచేయవలయుననిన దానికి ధనమును, బుద్ధియు నావశ్యకములు. సర్కారుఉద్యోగమేదైన చేయవలయుననిన విద్యశూన్యము. భిక్షమెత్తికొనిఅయినను జీవించవలయుననిన పూర్వప్రతిష్ట, గౌరవము ఆటంకములుగానుండెను. కానయప్పుడప్పుడు పూర్వవ్యవహారికులఇండ్లకేగి వారిచ్చుస్వల్పద్రవ్యముతో కాలక్షేపము చేయుచుండెను. పూర్వప్రతిష్ట వానిఅప్పుపత్రములయందుమాత్రమే నిలచియుండెను. దేవదత్తుని మందభాగ్యతవలెనే వాటియందలి అక్షరములుకూడా మలినమై కాలవిపర్యాయమును సూచించుచుండెను. దేవదత్తు డాఋణపత్రములను తనప్రాణముకన్న మిన్నగ జూచుచుండెను. అమావాస్య దినమున ప్రతిగృహమునందును లక్ష్మీపూజలు జరుగుచుండెను. దేవదత్తుని గృహమున లక్ష్మి లేదు సరికదా లక్ష్మియొక్క చిహ్నమైనను అగపడుటలేదు. కేవలము వానివద్ద డెబ్బదిలక్షలరూప్యములఅప్పుపత్రములు ఉండెను.

౨

దీపమాలికలన్నియూ తమఅల్పజీవితములు చాలించుకొనినవోయనునట్లు తేజోవిహీనములు కాజొచ్చెను. దేవదత్తుని భార్యయగు గిరిజ కానాటిప్రొద్దుటనుండియు మిగుల వస్వస్థతగనుండెను. విషజ్వరము ఆమెను ప్రతి క్షణమును మూర్ఛితగా జేయుచుండెను. అకస్మాత్తుగా ఆమె యులికిపడి కండ్లువిప్పి మిక్కిలి హీనస్వరముతో నిట్లు చెప్పెను:

"నేడు దీపావళీ అమావాస్య."

గిరిజకు స్మృతివచ్చుట, ఆమెమాట్లాడుట విచారమగ్నుడగు దేవదత్తునకు సంతోషము కలిగించెను. "అవును. నేడు దీపావళి అమావాస్య". గిరిజ భాష్పకలితనేత్రయై ఇటునటు వీక్షించుచు మెల్లగా నిట్లనెను: "మనఇంట్లో దీపము పెట్టరా?" ఆమాటవిని దేవదత్తుడు వెక్కివెక్కి ఏడువసాగెను. గిరిజ మరల అదేస్వరమున 'చూడుడు, మనఇల్లు ఈసంవత్సరమంతయూ అంధకారముగానే యుండును. నన్ను లేవదీయుడు. మన ఇంట్లో దీపము వెలిగించెదను.'

ఈమాటలు దేవదత్తుని హృదయమునందు బాణములవలె నాటెను.

* * * *

ఈపట్టణమున లాలాశంకరదాసు గొప్పవైద్యశిఖామణి. అతనుతన 'ప్రాణసంజీవని'యను పేరుగలఅను పత్రియందు ముద్రణాయంత్రముకూడ తెప్పించియుంచెను. మందులు కన్నను ప్రకటనలు హెచ్చుగానుండెను.

ఈవైద్యునివద్దనే దేవదత్తబాబు భార్యకు మందు తీసుకొని వెళ్లదలచెను. శంకరదాసు డబ్బు ఎక్కువగా నిచ్చిన వారిని బాగుగాచూచుచుండెను. కాన నిర్ధనుడగు దేవదత్తునితో ఎన్నడూ శంకరదాసు మాట్లాడియుండలేదు. దేవదత్తుడు ఎన్నడును తనభార్య అస్వస్థత యాతనితో చెప్పుటకు వీలుకలుగలేదు. ఒకదినమున దేవదత్తు డాతని సముఖమునకువెళ్లి ఎంతయు నేడ్చెను, యెంతయు మొరపెట్టుకొనెను. కాని మిక్కిలి కఠిన హృదయుడగు డాక్టరుబాబుహృదయము కరుగలేదు.

రాత్రి మిగుల భయంకరముగానుండెను. గగనమండలమందున తారలు బాగుగ మెరయుచుండెను. అర్ధరాత్రి ఆయెను. శ్రీనగరమునందు ఆరినదీపములను చూచి మీప్రకాశము ఇంతలోనెడిరేనా అని పరిహసించుచున్నవోయన్నట్లు తారలు తళతళ మెరయుచుండెను. పాపము దేవదత్తుడు కష్టదశలోనున్న గిరిజ యొక్క శయ్యాపార్శ్వమును వీడి డాక్టరు గృహమువైపునకు మరలెను. డాక్టరు బాబు 'ఫీజు' పుచ్చుకొనకుండ తన గృహమునకు రాడని దేవదత్తునకు బాగుగా తెలియును. అయినను-వారాతురులైనప్పటికి ఆశవదలరు- దేవదత్తు త్వరగమనమున నడచివెళ్లుచుండెను.

3

డాక్టరుబాబు ఆసమయమందు తన'రామబాణబిందు' యను మందునుగూర్చి పత్రికకు ప్రకటనవ్రాయుచుండెను. అతనిప్రకటనయొక్క ఆకర్షణశక్తి చూచువారలకు అతను వైద్యశిరోమణియో లేక 'సులేఖక్ విద్యావారిధి'యో చెప్పజాలరు.

డాక్టరుబాబు ప్రకటనపత్రము పూర్తిచేసి గట్టిగా చదువసాగెను. ఇంతలో దేవదత్తుడువచ్చి తలుపు కొట్టెను. వైద్యశిఖామణి లాంతరుచేతబూని వైటికేతెంచెను. వైద్యు డీధ్వనిని విని మిగుల సంతోషించెను. డాక్టరుబాబు ఫీజు రాత్రి రెండురెట్లుగాన సంతసముతో బయటకేతెంచ దేవదత్తుడు యేడ్చుచు అతని పాదములపైబడి "డాక్టరుబాబూ! ఈసమయమున మీరు నాయందు దయయుంచవలెను. గి[illegible]లనిపడన

యమునకు అతిథి కాబోవుచున్నది. మీరొక్కరే దానిని రక్షింపఁగలరు. లేకపోయిన నాభాగ్యమున ఎట్లు వ్రాయ బడియున్నదో అట్లుజరుగును. తమరు ఈసమయమున కొంచెముదయచేసి చూచిన నాహృదయాగ్ని కొంతయుప శమించును. నాశక్తికొలది ఆమెవిషయమున ఏలోటునుకలుగఁజేయలేదని నాకూరట కలుగును. కాని తమకు సమర్పణజేయుటకు తగినంతయోగ్యత నాకులేదని భగవంతునకు తెలుసును. కాని జీవించియున్నంతకాలమును మీకీర్తిగానము చేసెదను. మీ సేవకుడనై యుండెదను."

పాపము డాక్టరుబాబును మొదట కొంత జాలికలిగెను. కాని అది తటిల్లతవలె వెంటనే స్వార్థమనెడు అంధకారమున అదృశ్యమైపోయెను.

౪

పండిత దేవదత్తుడు నిరాశతో ఇంటికి మరలివచ్చి విచారించుచుండెను. "ప్రాణసంకటమందున్న గిరిజ యొక్క ఆరోగ్యముకొరకు నేనెంతయో విలపించుచున్నను ఫలములేకున్నదిగదా? వైద్యుడువచ్చి చూచుట కుపాయమేమున్నది? నాదగ్గర ఒక్కపైసఅయినను లేదే, నేనెట్లు వైద్యునకు ఫీజు ఇచ్చి ఇంటికి తీసుకొని రాగలను? నేనెట్లు కఠినహృదయుడగు వైద్యుని సంతోషపెట్టగలను? డాక్టరుబాబూ, నేను నాజన్మమంతయు నీసేవతో గడపెదను. నీయొక్క ఉదారత ప్రకటించెదను. నీమందులనుమారెదను" అనితనలోననుకొనసాగెను.

డెబ్బదిలక్షల అప్పుపత్రములు నేడొక గవ్వకైనను మారకున్నవిగదా యని దేవదత్తుడు తెలిసికొనెను. ఆఅప్పుపత్రములన్నియు నేటితో దూరముచేయుటకు సంకల్పించుకొని పెట్టితెరచి ముఖమలు సంచువాను బైటకు తీసి యొక్కొక్కటే దీపము దగ్గరపెట్టి కాల్చివేయసాగెను. ఏప్రకారముగా సుందరసుకుమారశరీరములు అగ్ని కాహుతియైపోవునో అట్లా అనేకలక్షలవిలువగల ఋణపత్రములుకూడ దీపమున కాహుతియైపోయెను.

ఇంతలో బయటనుండి దేవదత్తుని యెవరో పిలిచిరి. అతను ఉలికిపడి తలయెత్తి లేచి నిద్రనుంచి లేచిన వానివలె చీకటిలో తడుముకొనుచు వీధిద్వారమువరకువచ్చి తలుపుతీసిచూచెను. కొంతమంది భటులు చేత కరదీపికలను దాల్చి నిలచియుండిరి. ఏనుగుపై నెక్కి రాజదుస్తులతో ఒక సుందరయువకుడు కూర్చుని యుండెను. చూచువారలకు అతడు చాల గొప్పవాడని తెలియుచుండెను. అతను నల్లని అంగరఖా యును, తెల్లని పాయిజమాయును, మొలయందు ఒక విలువగల కత్తియును, మెడయందు బంగారుహారమును ధరించియుండెను. అవి యూతనికి మిగుల శోభకలిగించుచుండెను. దేవదత్తుని చూచుటతోడనే ఆనూతన పురుషుడు క్రిందకుదిగి దేవదత్తునకు నమస్కరించెను. అతనియొక్క వినయమునుచూచి దేవదత్తుడు లజ్జితుడై "తమరొక్క ఆగమనము ఎచ్చటనుండి?" అని అడిగెను. యువకుడు మిగులవినయముతో "నేనుతమయొక్క పూర్వుల సేవకుడను. దాసునియొక్క ఇల్లు రాజనగరమునగలదు. నేను అచ్చటి జాగీరుదారుడను. నాయొక్క పూర్వికులకు తమయొక్క పూర్వికులు చాలాదయకలిగియుండిరి. ప్రస్తుత నాయీప్రతిష్ఠ, సంపాదనకు తమయొక్క పూర్వికుల దయయేకారణము. నేను నాయొక్క స్వజనులవలన తమయొక్క పేరువినియుంటిని. నాకు ఎన్నియో దినములనుండి తమ దర్శనము చేయవలయునని వున్నది. నేడు అట్టి అవకాశము కలిగినందువలన నేను మిగుల ధన్యుడను." అనిచెప్పెను. దేవదత్తునకు తన పూర్వికుల ప్రతిష్టవినినందున ఆనందబాష్పములు వచ్చెను. వాని యొక్క దీనత కొంచెము సేపటివరకు దూరమయిపోయెను. అతను గంభీరభావముదాల్చి చెప్పెను. "మీరిట్లు చెప్పుట మీదయవలననే కాని ఆపూర్వికులసంతతిలోనివాడనని చెప్పుకొనుటకు నాకు తగినంత యోగ్యతలేదు." ఇంతలో యువకుని నౌకరులు చావడిలో తివాసిపరచిరి. వారిరువురును దానిపైకూర్చుండి మాట్లాడసాగిరి. యువకుని మాటలు వినుచున్నకొలది దేవదత్తుని ముఖకమలము ప్రాతఃకాలసూర్యదర్శనమువలన వికసించినట్లు

వికసించెను. దేవదత్తుని పితామహుడు యువకుని పితామహునకు ఇరువదియైదు వేలరూపాయలు అప్పుగానిచ్చి యుండెను. అట్లుఇచ్చి చాలకాలమవుటచే దానికి వడ్డీ ఏబది వేలరూపాయలు అయెను. ఆఋణము తీర్చుట కొరకే ఈయువకుడు రెండువందల మైళ్లు దూరమునుండి డెబ్బదియైదు వేలును పట్టుకొని వచ్చియుండెను. యువకుడు దేవదత్తునిచూచి మీవద్దపత్రముండియేయుండవచ్చును. దానిని తీసికొనివచ్చిఇచ్చి రూపాయలు తీసుకొనుడని చెప్పెను. దేవదత్తునిహృదయము బరువాయెను. హృదయావేగమణచికొని "బహుశాఉండవచ్చును. ఇది సరిగాచెప్పజాలను. లోనికిబోయి వెతకి తెచ్చెద"నని చెప్పి లోనికిబోయెను. "అది కాలిబూడిదయాయెనో లేక మిగిలెనో తెలియుటలేదు. పత్రములేక రూపాయలు ఎట్లువచ్చును. ఆరూపాయలు డాక్టరు బాబునకు ఇచ్చి అతనిని సంతోషపెట్టి గిరిజకు స్వస్థతకలుగజేసెదను." ఇట్లు దేవదత్తుడు తనలో అనుకొనుచు మిగిలిన పత్రములను వెతుకసాగెను. అతని అదృష్టవశమున ఆపత్రము దొరికెను. ఆపత్రము చేతపట్టుకొని సంతోషముతో పరుగెత్తి గిరిజయొద్దకువెళ్లి "గిరిజా! భగవంతునికృపకల్గిన నీవిప్పుడు జీవించుటకు అవకాశముకలిగినది" అని సంతోషముతో చెప్పెను. కాని గిరిజ ఈలోకమునువీడి వెడలిపోయెను. కేవలము ఆమెయొక్క శవము మాత్రమే అచ్చట మిగిలియుండెను. ఆమెప్రాణవాయువులు ఎగిరిపోయి గంటకావచ్చెను.

దేవదత్తు డాపత్రముచేతగొని యువకునియొద్దకేగి వాని కాపత్రమునిచ్చి రూపాయలు పుచ్చుకొనెను. యువకుడును అతనికి నమస్కరించి 'నాపూర్వికులు తమయొక్క ఋణమునుండి నేడు విముక్తులైరి.' అని వెడలిపోయెను.

ॐ

పండిత దేవదత్తుడు ఈయువకుని వీడుకొల్పి ఇంటిలోనికి వెళ్లెను. అతను మిగుల సంతోషముగా నుండెను. ఈసమయమునందాతనివద్దకు యాచకు లెవరైనవచ్చినయెడల నిరాశులై వెడలరు. సత్యనారాయణ వ్రతము మిగుల గొప్పగచేయవలయునని నిశ్చయించుకొనెను. గిరిజకొరకు బట్టలు, వస్తువులు చేయించవలయునని యాతడు అనుకొనెను. కాని గిరిజ ఎట్లున్నదో ఈసంతోషసమయమునం దాతనికి తెలియనే తెలియదుగదా!

అంతఃపురములో నడుగిడగనే అతడు భగవంతునికి నమస్కారమర్పించి మిగిలిన పత్రములను వెతికి ప్రోగుచేసి ఆముఖమలుపెట్టియందే ఉంచి దాచెను. "ఇక నాకీ జీవితకాలమున ధనసంపాదనగూర్చి చింతయుండదు. ఈశ్వరుడు నాకు కావలసినంత ధనమొసంగెను. దీనితో నాయొక్కయు గిరిజయొక్కయు జన్మములు సుఖముగా గడుపవచ్చును." కాని పాపము గిరిజయొక్క జన్మము ఇదివరకే సుఖముగా సమాప్తినొందినదని వాతనికి తెలియదాయెను. ఈసంతోష సమాచారము వినగనే గిరిజలేచి కూర్చుండునని అతడు అనుకొనుచుండెను. విచారము, కష్టము వానికి దశకలిగించినవి. కడుపునిండగ తిండి దొరుకనివానికి పద్రసాన్నము దొరికిన ఇట్టియవస్థయే సంభవించును. ఇట్లు ఆలోచించుకొనుచు గిరిజయొక్క పర్యంకముయొద్దకు వెళ్లి "గిరిజా! కనులను తెరువుము. ఈశ్వరుడు మనప్రార్థననువిని మనపై దయాదృష్టిబరపెను. నీదేహమున ఎట్లున్నది?" అని ఒక్కసారి అడిగెను. కాని గిరిజ మారుపలుకలేదు. వానికి ఆశ్చర్యమదయించి ఆమెపై కప్పియున్న శాలువును తీసిచూచెను. చూడగనే హృదయమునుండి మిగుల జాలిగొల్పు స్వరమున "ఆహా!" అను కేకనిట్టూర్పవచ్చెను. తలను చేతులయందుచేర్చుకొని అచ్చటనే కూలబడెను. కన్నులనుండి రక్తపుబొట్లు పడసాగెను. "ఆహా! ఈసంపదకొఱకు ఇంతప్రియమగుమూల్యమును ఇచ్చికొంటినా? ఈశ్వరా—నీవు మిగుల న్యాయవంతుడవని చెప్పెదరే? నాకు గిరిజయే కావలెను. ధనమక్కరలేదు. ఈధనమును నీవే తీసుకొని నాగిరిజను నాకీయుము."

౬

అమావాస్యనాటి అంధకారమయమగు రాత్రి గిరిజయొక్క అంధకారమయమగు జీవితమువలెనే పూర్తియాయెను. పొలములో నాగలిదున్నుచూ రైతులు గట్టిగా పాడుచుండిరి. నూతియొద్దన పురస్త్రీలు నీటికై కూడిరి. సీరునీరు తెచ్చుటకన్ననూ నవ్వుటకొరకు, కబుర్లుచెప్పుకొనుటకునూ చేరుచుందురు. ఒకతె నూతిలో చేదవేసి తనఅత్తసాధించు సాధింపులను చెప్పుచుండెను. ఒకతె నూతి చప్టాచాటునకువెడలి తన ప్రియసఖితో తొలినాటిరాత్రి భర్తవద్ద జరిగిన ప్రేమాలాపములను రహస్యముగా చెప్పుచుండెను. వృద్ధస్త్రీలు ఏడ్చుచున్న పసువలను ఒడియందిడుకొని తమతమకోడండ్రను తిట్టుచూ వారిచర్యలను చెప్పుకొనుచూవచ్చి గంట సేపయినను యింటికిమరలకుండిరి. కాని రాజవైద్యుడగు లాలాశంకరదాసు ఇంకను గాఢనిద్రయందుండెను. చాలమందిరోగులు చావిడియందు వేచియుండిరి. ఇంతలో పండితదేవదత్తుడు తలపైన, ఒడలిపైన నేమియు ధరించకుండ కేవలమొక ధోవతిమాత్రము అసందర్భముగా ధరించి, అగ్నికణములవలె మిగుల ఎర్రగానున్న కండ్లతో, భయంకరమగు ఆకారముతో కొన్నినోట్లకట్టను పట్టుకొని పరుగెత్తుచూ వచ్చెను. వచ్చి ఆఔషధాలయముయొక్క ద్వారమువద్దనిలుచుండి గట్టిగా తలుపుతట్టసాగెను. ఆశబ్దమునువిని డాక్టరు బాబు వులికిపడి తలుపుతీయించెదనని చెప్పుచూ క్రిందకువచ్చెను. ఇంతలో దేవదత్తుడెదురుగవచ్చినిలుచుండి నోట్లకట్టను అతనిముందుపడవైచి "డాక్టరుబాబు! ఇవి డెబ్బదిఐదు వేలరూపాలయనోట్లు. ఇవి తమయొక్క ఫీజు. తమరు వచ్చి గిరిజను చూడుడు. మరియు ఆమెయొక్క కండ్లను ఒక్కసారి తెరపించుడు. కేవలము ఆమెయొక్క ఒక్కదృష్టిపై నివియన్నియు హీనములు. ఒక్కదృష్టిపై ఇదియంతయు మిగుల స్వల్పము. తమకు మనుష్యుల ప్రాణములకన్నను ధనమేప్రధానము. ఆధనము మీఎదుటనే ఉంచితిని. నాకు గిరిజ ఈరూపాయలకన్నను ఎన్నియోరెట్లు ప్రియమైనది." అని చెప్పెను. డాక్టరుబాబు మిగుల లజ్జితుడై జాలికలుగు వీక్షణములతో దేవదత్తునివైపుచూచి "నాకుమిగుల విచారముగనున్నది. నేను నాజీవితకాలమునందంతయు మీకుఅపరాధిని. కాని మీరు నాకు శిక్షఇచ్చితిరి. ఈశ్వరుని దయవలన ఇట్టితప్పు ఎన్నడును చేయను. నాకుమిగుల విచారముగ నున్నది. నిజముగనే నేను మిగులవిచారించుచుంటిని." అని అనెను. ఈవాక్యములు వైద్యుడు హృదయపూర్వకముగా చెప్పెను.

చిత్రప్రశ్న

శ్రీమతి ఆచంట సత్యవతమ్మ గారు

ఆరక్షరంబుల ఆర్యులగ్రంథమ్ము అతివ్యాప్తినొందుచు నలరుచుండు
ఆద్యక్షరద్వయంబనువుగా భగవంతుగొలుచువారినితెల్పు కొమరుమిగిలి
ఒకటైదుఆరులు ఒనరంగకలిపిన భీతికిమారుపే రతికియుండు
నాలుగైదారక్షరాలనుగల్పంగ గెలుపునకర్థంబు నెలమిగాంచు
మూడునాల్గయిదారు మోదంబుదీపించుసంపూర్ణజయమును సరవిదెల్పు
అట్టిపుస్తకనామంబు నరసిమీరు పత్రికాబాల "గృహలక్ష్మి" కందజేసి
ఆర్యమతజ్ఞానమభివృద్ధియగువిధాన యశమునొందంగబూనుడో అమ్మలార!

☞ ఇట్టి వానియందు రుచిగల గృహలక్ష్మి పాఠకురాండ్రు ఈప్రశ్నకు జవాబు ఆలోచించి లేఖాముఖమున మార్చి 10–వ తేదీలోపున మాకు తెలుపుదురుగాక!

—సంపాదకుడు.